## క్లుప్తంగా

### కోనేరు మరమ్మతులకు సహకరించాలని వినతి

అరసవల్లి: మంచినీటి కోనేరును బాగు చేసుకోవడానికి జిల్లా పరిషత్ తరఫున నిధులు అందజేసి సహకరించాలని పానుగుటివలస గ్రామానికి చెందిన యువకులు కోరారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయను సోమవారం తన కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

### లోకోస్ యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న ప్రమీల

జి.సిగడాం: జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ద్వారా ప్రవేశ పెట్టిన లోకోస్ యాప్‌పై మహిళా సంఘాల సభ్యులు అవగాహన కలిగి ఉండాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీల, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో లోకోస్ యాప్‌పై సీసీ, సీఎఫ్‌లకు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

### అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: గుమడాం గ్రామంలోని ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ రూ. 20 వేల ఆర్థిక సాయం చేశారు. గ్రామానికి సోమవారం విచ్చేసిన ఎమ్మెల్యేను స్థానిక యువత కలిసి కాలనీలో ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ విగ్రహం కోసం సాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన తక్షణమే 20 వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలక్రిష్ణ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, గుమడాం పంచాయతీ సర్పంచ్ జి.పైడయ్య, ఉప సర్పంచ్ దురగాసి ధర్మారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### భవన నిర్మాణ కార్మికుడు మృతి

రణస్థలం: భవన నిర్మాణ కార్మికుడు పని చేస్తున్నచోటే కుప్పకూలిపోయి మృతి చెందాడు. ఈ విషాద ఘటన కోష్ట గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకోగా.. విజయనగరం జిల్లా రాజాం మండలం రాజీపేట గ్రామానికి చెందిన బి.సంతోష్ (30) ప్రాణాలు కోల్పోయాడు. సంతోష్ కోష్టలోని మందిరం సమీపంలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ తెలిపారు. చనిపోవడానికి వడదెబ్బ లేక గుండెపోటా అనేది శవపంచనామాలో తెలియాల్సి ఉందన్నారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### మహిళపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి



గాయపడిన కృష్ణవేణి

నరసన్నపేట: మండలంలోని జమ్ము సమీపంలో గల కొల్లవాని చెరువు వద్ద టిఫిన్ షాపు నిర్వాహకురాలు గెంబలి కృష్ణవేణిపై సోమవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. అపస్మారక స్థితిలో ఉన్న కృష్ణవేణిని నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు సోమవారం రాత్రి తీసుకెళ్లారు. టిఫిన్ షాపులో పనులు చేసేందుకు ఇంటి నుంచి కృష్ణవేణి బయటకు రాగా.. ఓ వ్యక్తి తలపై కర్రతో గాయపరిచినట్లు భర్త భీమారావు తెలిపారు. మరోవ్యక్తి ద్విచక్ర వాహనంతో రోడ్డుపై ఉన్నాడని, కృష్ణవేణి కింద పడిన వెంటనే ఇద్దరూ వెళ్లిపోయారని తెలిపారు. ఈ దాడి దొంగలే చేసి ఉంటారని భీమారావు అనుమానం వ్యక్తం చేశారు. ఆమె మెడలో పసుపుతాడే ఉందని, ఎటువంటి బంగారు అభరణాలు లేవన్నారు. ఈ సంఘటనపై నరసన్నపేట ఎస్‌ఐ వద్ద ప్రస్తావించగా.. ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించామని, కేసు నమోదు చేయలేదన్నారు.

### సీసీ కుటుంబానికి ఆర్థికసాయం

నరసన్నపేట: వైఎస్సార్ క్రాంతి పథంలో గార మండలంలో సీసీగా పని చేస్తున్న కనపల పాపాయమ్మ కుటుంబాన్ని డీఆర్‌డీఏ పీడీ డీవీ విద్యాసాగర్ సోమవారం పరామర్శించారు. నరసన్నపేట మండలం పోతయ్యవలసకు చెందిన పాపాయమ్మ అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మృతి చెందాచారు. సమాచారం తెలుసుకున్న పీడీ ఆమె కుటుంబ సభ్యులకు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె కుటుంబానికి జిల్లా సమాఖ్య తరఫున తక్షణ సహాయంగా రూ.25 వేలు అందించారు. వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది ఆమె కుటుంబానికి అండగా ఉండాలని సూచించారు.

# విజ్ఞాన శిబిరాలు ఆరంభం

- వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వక్తల పిలుపు



ఎచ్చెర్ల క్యాంపస్: పుస్తక పఠనంలో విద్యార్థులు

లావేరు:

వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయని లావేరు మండల విద్యాశాఖాధికారి ఎల్.ఈశ్వరరావు, మురపాక హైస్కూల్ హెచ్‌ఎం ఎం.అరుణ అన్నారు. లావేరు శాఖాగ్రంథాలయంలో ఎంఈవో, మురపాక గ్రంథాలయంలో ప్రధానోపాధ్యాయురాలు వేసవి విజ్ఞాన శిబిరాలను సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇంటి వద్ద ఖాళీగా ఉండకుండా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరాలకు రావాలన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే ఎన్నో విషయాలు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు ఎ.గడ్డెయ్య, పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ధర్మవరం శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.రఘునాథరావు మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ అధికారి చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. ఏపీ పౌర గ్రంథాలయం శాఖ ఆదేశానుసారం శిబిరాన్ని ప్రారంభించామన్నారు. జూన్ 11వ తేదీ వరకూ నిర్వహించే శిబిరంలో పిలలకు కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, అముద్రిత కథలు చెప్పుట, చిత్రలేఖనం, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు రోజు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో మిథిలా విద్యాలయం కరస్పాండెంట్ జయరాం, గ్రంథాలయ సహాయకులు బి.సూర్యనారాయణ, యువకులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. జూన్ 11వ తేదీ వరకు శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉపాధ్యాయులు పి.సోమేశ్వరరావు హాజరై స్వాతంత్ర్య సమర యోధుల పోరాటంపై పిల్లలకు వివరించారు. జాతీయ నాయకుల బయోపిక్‌లు చదవాలని సూచించారు. గ్రంథాలయాధికారి ఎం.నీలమ్మ పాల్గొన్నారు.

గార: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. తొలిరోజు విద్యార్థులకు నీతి పద్యాలు, కథలు పుస్తకాలు, అరేబియన్ కథకల పుస్తకాలను చదివించారు. పాఠకులు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి ఎం.జనార్దనరావు మాట్లాడుతూ.. శిబిరాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.రామకృష్ణ, ఎస్.ఢిల్లీశ్వరరావు, బి.అప్పారావు, బి.కృష్ణారావు, గ్రంథాలయ సహాయకుడు సిహెచ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.



గార: శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం అర్బన్: మాట్లాడుతున్న రాధాప్రసాద్

రణస్థలం: విద్యార్థుల మేధస్సుకు పుస్తక పఠనం ఎంతో ఉపయోగ పడుతుందని విశ్రాంత ఉద్యోగి ఆర్.ధర్మారావు అన్నారు. రణస్థలం శాఖా గ్రంథాలయంలో ప్రారంభించిన వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మొదటి రోజు పిల్లలతో దినపత్రికలు, కథలు చదివించడం, రాయించడం చేయించారు. మిత్ర లాభం- మిత్ర భేదం కథను చదివి వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి, హిందీ, సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది ఉన్నారు.

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా గ్రంథాలయ సిబ్బంది చూడాలని ఇంటాక్ కన్వీనర్ కె.వి.జె.రాధాప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేలా చిన్నారుల తల్లిదండ్రులు, గ్రంథాలయ సిబ్బంది చూడాలన్నారు. పుస్తకాలు, దిన పత్రికలకు చదవడంపై ఆసక్తి కలిగించలన్నారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి.వి.జి.ఎస్.శంకరరావు మాట్లాడుతూ.. వేసవి విజ్ఞాన శిబిరానికి సంబంధించి కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాల కార్యక్రమాల గురించి ఎలా చెబితే పిల్లల్లో ఆసక్తి కలుగుతుందో వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.కృష్ణారావు, టి.ఎరమ్మ, ఎస్. ఈశ్వరరావు, వి.కామేశ్వరరావు, న్యాయవాది టి.హిమలక్ష్మి, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక అధ్యక్షుడు ఎం.రామకృష్ణారావు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, జూనియర్ అసిస్టెంట్ కె.చిరంజీవులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



లావేరులో మాట్లాడుతున్న ఎంఈవో ఈశ్వరరావు



ఎచ్చెర్ల: మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు రఘునాథరావు



రణస్థలం: విద్యార్థులకు కథలు చెబుతున్న ధర్మారావు

## దివ్యాంగులకు త్రీ వీలర్ వాహనాల పంపిణీ



దివ్యాంగులకు వాహనాలను అందజేస్తున్న కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తోందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ అధ్వర్యంలో పది మంది దివ్యాంగులకు త్రీ వీలర్ స్కూటీలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని దివ్యాంగులకు అత్యధిక పింఛన్‌ను కూడా అందజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఐఈఆర్ సహాయ సంచాలకులు ఏడీ కె.కవిత, సీఆర్‌ఎంవో సూపరింటెండెంట్ ఎస్.వి.వర్మ, రణస్థలం, లావేరు, జి.సిగడాం మండలాల ఎంపీడీవోలు ధనుంజయరావు, సురేష్, శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దన్నాన రాజినాయుడు, వైస్ ఎంపీపీ మైలపల్లి కామరాజు, జీరు రామారావు, కరిమజ్జి భాస్కరరావు, టేకి బ్రహ్మాజీ, మజ్జి జగదీష్, బొంతు యల్లంనాయుడు, ఇజ్జాడ వెంకటరమణ, గొర్లె సూర్యప్రకాశ్, పల్లె లక్ష్మణ, మజ్జి ఈశ్వరరావు ఉన్నారు.

## కాలువ నీరు వెళ్లేలా చూడాలి



కమిషనర్‌కి వినతి పత్రం అందజేస్తున్న దుప్పలవలస గ్రామస్తులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం కార్పొరేషన్‌లో విలీనమైన దుప్పలవలస పంచాయతీ గ్రామకంఠంలో కొంత భూమిని శీర సాంబమూర్తి కబ్జా చేసి మురుగునీరు వెళ్లకుండా చేశారని.. ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్ చల్ల ఓబులేసుకి సోమవారం వినతి పత్రం అందజేశారు. నీరు వెళ్లి పోయేలా చూడాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సీర దుర్గాప్రసాద్, సీర సీతారాం, పైల చంద్రశేఖర్, రుప్ప సుందరరావులున్నారు.

## విద్యార్థులకు అభినందనలు



లావేరు: 575 మార్కులు సాధించిన ప్రతిమ

లావేరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మురపాక హైస్కూల్ విద్యార్థులను హెచ్‌ఎం ఎం.అరుణ, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. ఆర్.జ్యోతి ప్రియ 572, టి.క్రాంతికుమార్ 566 మార్కులు సాధించారు. వీరితోపాటు మరికొందరు ఉత్తమ మార్కులు తెచ్చుకున్నారు. దీంతో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి మిఠాయిలు తినిపించి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తేనేల సురేష్‌కుమార్, తేనేల విద్యాసాగర్ ఉన్నారు. అలాగే బుడుమూరు హైస్కూల్ విద్యార్థిని కింజరాపు ప్రతిమ 575 మార్కులు సాధించింది. ఈమెను ఉపాధ్యాయులు అభినందించారు.

జి.సిగడాం: టెన్త్‌లో 550 మార్కులు సాధించిన పెంట గ్రామానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులను గ్రామస్తులు, యూపీ పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగి మక్క సాయిబాబా, ప్రధానోపాధ్యాయుడు మజ్జి మదన్‌మోహన్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కోనారి నారాయణప్పుడు, బొల్లా శ్రీనివాసరావు, గిడిజాల చంద్రరరావు, గొర్లె శేఖర్, బోనేల గౌరీశ్వరావు, కొండలరావు ఉన్నారు.



లావేరు: క్రాంతికుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



జి.సిగడాం: విద్యార్థులను అభినందస్తున్న దృశ్యం

## ముగిసిన ఏపీఈఏపీసెట్ ఉచిత శిక్షణ శిబిరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎస్.సి.వి.రమణమూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ సెట్ - 2023లో విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలని ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సి.వి.రమణమూర్తి అన్నారు. కళాశాలలో 45 రోజులు నిర్వహించిన ఏపీఈఏపీసెట్ ఉచిత శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. చివరి రోజున పరీక్ష రాసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గణితం, రసాయన, భౌతిక శాస్త్రం మూడింటిల్లో మెరుగైన మార్కులు సాధిస్తే మంచి ర్యాంకు వస్తోందన్నారు. ఆన్‌లైన్‌లో జరగనున్న పరీక్షలో ప్రశ్నను అర్థం చేసుకొని జవాబు రాయాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ బుడుమూరు శ్రీరాంమూర్తి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న రఘురామ్

గార: మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. బలరాంపురం పంచాయతీలో జగనన్నే మా భవిష్యత్..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. లబ్ధిదారుల నుంచి సమాచారాన్ని తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. మత్స్యకారుల కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బుడగట్లపాలెంలో హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందన్నారు. అలాగే వేట నిషేధభృతి రూ. పది వేలకు ప్రభుత్వం పెంచిందన్నారు. మత్స్యకారుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. ఐదు లక్షలు వెంటనే పరిహారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో పీస గోపి, జిల్లా మత్స్యకార సంఘ అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు, కోనాడ నర్సింహులు, శిమ్మ ధర్మరాజు, ఎంపీటీసీ సభ్యులు కోట రామారావు, రుప్ప శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సక్రమంగా విద్యాకానుక కిట్ల పంపిణీ

- ఎంఐఎస్ జిల్లా కోఆర్డినేటర్ శోభ



విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న శోభ

లావేరు: జగనన్న విద్యాకానుక కిట్లను సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా ఎంఐఎస్ కోఆర్డినేటర్ బి.శోభ అన్నారు. లావేరు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాకానుక కిట్ల మండల పాయింట్‌ను సోమవారం పరిశీలించారు. మండలానికి ఇంతవరకూ వచ్చిన కిట్ల వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న కిట్లను సక్రమంగా అందజేయాలని సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుంచి పదోతరగతి వరకు చదువుతున్న విద్యార్థుల అందజేయడం కోసం మండలానికి 36,662 నోట్ పుస్తకాలు వచ్చాయని, వాటిని హెచ్‌ఎంల ద్వారా అందజేస్తామని ఎంఈవో ఎల్.ఈశ్వరరావు చెప్పారు. అసిస్టెంట్ ఎల్ఈడీ కోఆర్డినేటర్ ఎస్.అనూరాధ, హెచ్‌ఎం పట్నాన రాజారావు ఉన్నారు.

## సిరిమాను సిద్ధం



సిరిమానును సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

జలుమూరు: జలుమూరులో ఆదిలక్ష్మి అమ్మవారి సిరిమాను ఉత్సవాలకు ఉజ్జిడి సిరిమాను సోమవారం సిద్ధం చేశారు. మంగళవారం ఉదయం ప్రారంభం కానున్న సిరిమాను ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అమ్మవారికి చల్లదనం కోసం పసుపు కుంకుమలతో ముర్రాటలు సమర్పించారు.

**ట్రాఫిక్ మళ్లింపు ఇలా..**

ఆదిలక్ష్మి అమ్మవారి పండగలకు బుధవారం ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ఎస్‌ఐ పి.పారినాయుడు సోమవారం తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు వరకు ఆర్టీసీ బస్సులను జలుమూరు గ్రామంలోకి ప్రవేశాన్ని రద్దు చేశామన్నారు. నరసన్నపేటతోపాటు వివిధ గ్రామాల నుంచి జలుమూరు వెళ్లాల్సిన వాహనాలను చల్లవానిపేట, జోనంకి, సుబ్రహ్మణ్యపురం మీదుగా బుడితి, కొమనాపల్లి, శ్రీముఖలింగం తదితర గ్రామాలకు వెళ్లేందుకు రూట్‌ను సిద్ధం చేశామన్నారు.

## అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల వర్తింపు

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్
- గుమడాం, వాల్లేపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



గుమడాంలో వృద్ధుడికి సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ చేరువ చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. గుమడాం, వాల్లేపేట గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. ఇప్పటి వరకూ చేకూరిన లబ్ధిని వివరించి అందుకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలక్రిష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, గుమడాం సర్పంచ్ గందవరపు పైడయ్య, ఉప సర్పంచ్ దురగాసి ధర్మారావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, ఎంఈవో ఎల్.ఈశ్వరరావు, పీఆర్, హౌసింగ్ ఏఈలు ఎల్.అప్పన్న, కె.అప్పలనాయుడు, వెటర్నరీ డాక్టరు జి.లావణ్య, ఏపీఎం ఎం.మాధవీలత, ఏపీవో ఆర్.సత్యవతి, మహిళా అధ్యక్షురాలు ఎం.విజయలక్ష్మి, గుమడాం ఎంపీటీసీ మాజీ సభ్యుడు వాల్లే కాశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

**నేడు ఇబ్రహింబాద్‌లో...**

ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహింబాద్ గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కుమార్ పట్నాయక్ సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సమక్షంలో జరగనున్న కార్యక్రమానికి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు హాజరు కావాలన్నారు.

### 38 మద్యం సీసాలు స్వాధీనం

- నలుగురిపై కేసు నమోదు

పాతపట్నం: ఒడిశా నుంచి అక్రమంగా మద్యం తీసుకువస్తున్న నలుగురు వ్యక్తులను పట్టుకుని కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు సోమవారం తెలిపారు. పర్లాకిమిడి నుంచి 38 మద్యం సీసాలను తీసుకువస్తుండగా పాతపట్నం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వీటి ధర రూ.8,840 ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: పాతపట్నం ఏపీ ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి సోమవారం తెలిపారు. 5వ తరగతి చదివిన విద్యార్థులు ఈ నెల 9వ తేదీ నుంచి 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జూన్ 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీలు రూ.75, ఓసీ, బీసీలు రూ.150 చెల్లించాల్సి ఉంటుందన్నారు. హెచ్‌టిటిపిఎస్:ఏపీఎంఎస్.ఏపీ.జీఓటీ.ఇన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## 610 మందికి వైద్య పరీక్షలు



నరసన్నపేట: రోగులకు తనిఖీలు చేస్తున్న వైద్యులు



ఆమదాలవలస రూరల్: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆమదాలవలస రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు వై.అప్పలకొండ అన్నారు. మండలంలో కట్యాచార్యులపేట గ్రామంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని సూచించారు. వేడి ఆహార పదార్థాలు, సురక్షితమైన తాగునీటిని నిత్యం తీసుకుని ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

**సత్యవరంలో..**

నరసన్నపేట: మండలంలోని సత్యవరంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 310 మందికి తనిఖీలు చేపట్టి మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ ఆరంగి మురళి ప్రారంభించారు. కిమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జెమ్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తనిఖీలు చేసి మందులు అందజేశారు.

## నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీ సర్పంచ్ అడపాక శంకరరావుపై సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో జేసీ నవీన్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు ఫిర్యాదు అందించారు. పంచాయతీలో తన సొంత నిధులతో తాగునీటి బోరు, రచ్చబండ, సిమెంట్ కాలువలు నిర్మించానని శ్రీనివాసరావు తెలిపారు. ఈ నిర్మాణాలపై పంచాయతీ నిధులు సుమారు రూ.2.50 లక్షలు అక్రమంగా బిల్లులు చేయించుకున్న సర్పంచ్ శంకరరావుపై చర్యలు తీసుకోవాలన్నారు.

**ఒంద్రుజోలలో..**

ఒంద్రుజోల గ్రామంలోని సర్వే నంబర్ 23లో ఉన్న భూమిని అదే గ్రామానికి చెందిన ఆర్.తిరుపతిరావు తప్పుడు పొజిషన్ సృష్టించి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు జిల్లా కలెక్టరేట్ నిర్వహించిన స్పందనలో బుడ్డు త్రినాథ్, సింహాద్రితో పాటు పలువురు ఫిర్యాదు చేశారు. తిరుపతిరావు పొజిషన్ చేయించుకున్న భూమి తరాల నుంచి మేకుల శాలలుగా ఉపయోగిస్తున్నామని ఫిర్యాదుదాలు తెలిపారు. తప్పుడు పొజిషన్ ఇచ్చిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

**గూనభద్ర ఆర్ఆర్ కాలనీలో...**

గూనభద్ర ఆర్ఆర్ కాలనీ పంచాయతీ పరిధిలోని నివాసం ఉంటున్న గదబపేటకు చెందిన నిర్వాసితులకు సంకిలి కొండపై సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని సర్పంచ్ సాధుబాబు తోపాటు నిర్వాసితులు సీతంపేట ఏటీడీఓ పీఓకు వినతిపత్రం అందజేశారు.